

నేడు విచారణకు రండి


- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు మళ్లీ నోటీసులు
- ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబి మాజీ ఒఎస్‌డి ప్రభాకర్‌రావును గురువారం విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐదు దఫాలపాటు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు విచారించారు. తాజాగా, ఆయన సెల్‌ఫోన్, ట్యాప్‌టాప్‌లను అధికారులు స్వాధీనపర్చుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషణ జరుపుతున్నారు. ల్యాప్‌టాప్‌తోపాటు ఆయన సెల్‌ఫోన్‌కు సంబంధించి 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు వాటి ద్వారా ప్రభాకర్‌రావు జరిపిన వ్యవహారాలపై కూపీ లాగుతున్నారు. వాట్సాప్ చాటింగ్‌లు, మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌పై అధికారులు దృష్టి కేంద్రీకరించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికే వీటిద్వారా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఏయే ప్రముఖులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రభాకర్‌రావు పర్యవేక్షించారనే విషయాన్ని సిట్ అధికారులు కూపీ లాగినట్టు తెలిసింది. ఇక, ఆయన కింది స్థాయి అధికారులు, బాధితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ సారి క్షుణ్ణంగా ప్రభాకర్‌రావును విచారించడానికి అధికారులు సిద్ధమైనట్టు తెలిసింది.

తెలంగాణ హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టం

- అసెంబ్లీకి రండి.. ఎవరేం చేశారో చర్చిద్దాం
- ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకైనా సిద్ధం
- నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలు రాకుండా ఎందుకు అడ్డుకున్నారు..?
- ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం కంటే కెసిఆర్ హయాంలో వెయ్యి రెట్లు ఎక్కువ నష్టం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టమనీ, దేవుడు ఎదురొచ్చినా నిటారుగా నిలబడి కొట్లాడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ఎవరేం చేశారో వివరంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహించాలో స్పీకర్‌కు లేఖ రాసినా మేం రెడీ.. ఎక్స్‌పర్ట్‌లను కూడా పిలుద్దాం. వారి సమక్షంలోనే అన్ని అంశాలపై అర్థవంతమైన చర్చ చేద్దాం. ఆరోగ్యం సహకరించకపోతే ఎర్రవల్లి ఫాం హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకైనా సిద్ధం.. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా మీ గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత నాది.. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.. అని మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి రేవంత్ అన్నారు.

నదీ జలాలపై బుధవారం ప్రగతిభవన్‌లో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సాగునీటి రంగంపై అసెంబ్లీలో చర్చిద్దామంటే క్లబ్బులు, పబ్బుల్లో హడావిడి చేస్తున్నారని సిఎం ఎద్దేవా చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలకు కెసిఆర్ మరణశాసనం రాశారని అన్నారు. హైదరాబాద్ నగరానికి తాగునీరు ఇచ్చిన తర్వాతే మిగులు జలాలపై చర్చిస్తామని ఆనాడు కెసిఆర్ అని ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. జూరాల నుంచి పాలమూరు రంగారెడ్డికి కృష్ణా జలాలను తరలించి ఉంటే ఎపికి అవకాశం ఉండేది కాదన్నారు. గోదావరి జలాలను ఎపికి తరలించే విషయంలో బేసిన్లు, భేషజాలు లేవని ఆనాడు సిఎం హోదాలో ప్రకటించిన కెసిఆర్.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు గోదావరి జలాలు ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఒక్క ప్రాజెక్టును కూడా గత పదేళ్లలో పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు చేసిన అన్యాయం కంటే వెయ్యి రెట్లు అధికంగా కెసిఆర్ తెలంగాణకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. ఆంధ్రపాలకుల మెప్పు కోసం తెలంగాణ హక్కులను కెసిఆర్ తాకట్టు పెట్టారని విమర్శించారు. కెసిఆర్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే బిఆర్ఎస్ నాయకులు రోడ్డెక్కి అవాస్తవాలు మాట్లాడుతున్నారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు కలిసి రండి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: పారిశ్రామిక వేత్తలు తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కలిసి రావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)నిర్వహించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తారు, చక్కటి వాతావరణం, కాలుష్య రహితం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 100 ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అదనంగా త్వరలో ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)అందుబాటులోకి రాబోతోంది. ఔటర్ రింగ్ రోడ్డు ఫలితాలను మనం చూసాం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డుతో ఫార్మా, ఐటీ కంపెనీలతోపాటు హౌసింగ్, అగ్రికల్చర్, హ్యాండ్లూమ్స్ వంటి అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం జరుగుతున్నాయి. లండన్‌లోని థేమ్స్ నదిలా హైదరాబాద్‌లో మూసీని పారించేందుకు మూసీ పునర్జీవనం చేపట్టాం" ఈ అవకాశాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని భట్టి విజ్ఞప్తి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అనలిటిక్స్, ఆటోమేషన్ లాంటి సాంకేతికత ప్రపంచ గతిని మారుస్తోందని అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్రతలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఎన్నో కీలక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అన్ని వర్గాల విద్యార్థులకు సమానమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన బ్యాంకులకు చెల్లించిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించాలని నిర్ణయించినట్టు భట్టి వివరించారు. ఈ సదస్సు ద్వారా జరిపే చర్చలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, శివ ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరసింహం, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు సిపిఎం నేతలు జూలకంటి, సాగర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ బుధవారం పరామర్శించారు. కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో రాజేశ్వర్‌రెడ్డి గాయపడిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయనకు సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో సర్జరీ అయ్యింది. రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వారు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలనీ, ప్రజల్లో తిరగాలని ఆకాంక్షించారు.



రెండ్రోజుల్లో సాగర్ గేట్లను తాకనున్న నీరు

- 538 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్ గేట్లకు మరో రెండ్రోజుల్లో జలాలు తాకనున్నాయి. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు. బుధవారం రాత్రికి సాగర్ నీటిమట్టం 538 అడుగులకు పెరిగింది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 1,17,868 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇది సుమారు 10 టిఎంసిలకు సమానం అంటే రోజుకు సగటున 10 టిఎంసిల నీరు సాగర్ జలాశయంలోకి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 312 టిఎంసిలు కాగా, 184 టిఎంసిల నీరు ఇప్పటికే చేరుకుంది. మరో 128 టిఎంసిలు వస్తే 590 అడుగులకు చేరుతుంది. శ్రీశైలం నుంచి వరద ఇలాగే కొనసాగితే 10 నుంచి 12 రోజుల్లో సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 1,87,315 క్యూసెక్కుల నీరు వస్తుండగా, పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 882 అడుగులు ఉంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో 40 శాతం కోటా అమలు

- డిఎంఇకి తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి



డిఎంఇకి వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీవో నెంబర్ 154 కింద అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో 40 శాతం కోటాను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ నేతృత్వంలో నాయకులు బుధవారం డిఎంఇ డాక్టర్ నరేందర్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) నుంచి డిఎంఇ పరిధికి సరెండర్ అయిన వారిలో జిఒ ప్రకారం అర్హులు లేకపోవడంతో కోటా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొన్ని మినహాయింపులు ఇవ్వాలని కోరారు. ప్రొబేషనరీ పీరియడ్ ప్రకటించిన వారితో పాటు ఇటీవల పీజీ పూర్తి చేసిన వారికి ఒక ఏడాది సర్వీస్ నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా టివివిపిలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లను (జీడీఎంఓలు) కూడా 40 శాతం కోటాలో చేర్చాలని సూచించారు. ఈ మినహాయింపుల ద్వారా బోధనా సిబ్బంది కొరత తీరడంతో పాటు వైద్యవిద్య మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట

- కనెక్టివిటీలో హ్యామ్ రోడ్లు కీలకం
- ఆర్ఆర్ఆర్ సదరన్ పార్ట్‌కు సిఎంతో కలిసి కృషి
- మంత్రి కోమటిరెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి సమపాళ్లలో ప్రాధాన్యతనిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్ఎఐ శాఖల అధికారులతో సచివాలయంలో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కనెక్టివిటీలో హ్యామ్ రోడ్లు కీలకం కానున్నాయని తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ఏరియాలుగా రోడ్ల నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో చేపడతామని తెలిపారు. సిఎం హ్యామ్ రోడ్ల ప్యాకేజీల ఆమోదంతో తర్వాత టెండర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో రోడ్ల ప్యాకేజీల వివరాలు చర్చించారు. ఎన్‌హెచ్ఎఐ నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో నాణ్యత పాటిస్తూ హ్యామ్ రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. పదేళ్ల వరకు చెక్కు చెదరకుండా ఉండేలా క్వాలిటీ పాటించేలా వర్క్ ఏజెన్సీలకు ముందుగానే తెలియజెప్పాలని ఆర్ అండ్ బి అధికారులతో అన్నారు. ఫీల్డ్ విజిట్ చేస్తూ క్వాలిటీ చెక్ చేయడమే కాకుండా లో లెవెల్ బ్రిడ్జి, హై లెవల్ బ్రిడ్జ్ లాంటివి ముందే గుర్తించి భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. రవాణాకు అసౌకర్యం లేకుండా కన్సల్టెంట్ బృందాలతో సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50శాతం రోడ్లు కవర్ అవుతాయన్నారు. అధికారులు కష్టపడి పనిచేస్తే ఫలితాలు వస్తాయని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనుల ప్రారంభంతో పాటు దక్షిణ భాగం ఆమోదం కోసం సిఎంతో కలిసి ప్రధాని మోడీ, కేంద్రమంత్రి గడ్కరీని త్వరలో కలుస్తామని చెప్పారు. టిమ్స్ హాస్పిటళ్లు, వరంగల్ హాస్పిటల్, మెడికల్ కాలేజీలు, కలెక్టరేట్లు, పలు ఆర్వోబీల నిర్మాణం చివరి దశలో ఉన్నవాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కష్ణ ప్రసాద్, అధికారులు, ఆర్ అండ్ బి ఇఎన్‌సి జయభారతి, సిఇలు రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌నాయక్, ఎస్ఇ ధర్మారెడ్డి, పలువురు ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

- ధ్రువపత్రాల పరిశీలనకు 95,216 మంది హాజరు
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్ల నమోదుకు తుది గడువు గురువారంతో ముగియనుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 95,216 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. 74,542 మంది అభ్యర్థులు 39,54,951 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఒక అభ్యర్థి ఎక్కువగా 1,051 ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ నెల పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువు ఉందని తెలిపారు. ఈ నెల 13న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 14, 15 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల మార్పు, చేర్పులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒకవేళ మార్పులు చేయకుంటే వాటినే మొదటి విడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. అదే నెల 18 నుంచి 22వ తేదీ వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ష్ట్రజూం:7/ౖస్తముఖుజూ.ఎవ్.అఱఎ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మోడీ సర్కారుపై కార్మికుల కన్నెర్ర

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- సమ్మె జయప్రదం చేసిన కార్మికులకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌ల రద్దు కోసం, కార్మిక హక్కుల కోసం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె తెలంగాణలో సక్సెస్ అయిందనీ, రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన 10,20,000 కార్మికులు పాల్గొన్నారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వెల్లడించారు. సమ్మెను జయప్రదం చేసిన ప్రతి కార్మికునికీ పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. '29 కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారుల ప్రయోజనాలు, వారి అధిక లాభాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలకు వ్యతిరేకమైన నయా ఉదారవాద, మతోన్మాద - కార్పొరేట్ విధానాలను విరమించుకోవాలని, ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రయివేటీకరించొద్దని కోరుతూ 20 డిమాండ్లతో తలపెట్టిన సమ్మె జయప్రదమైంది. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమల్లో 72,905 మంది, మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతంలో 2,810 పరిశ్రమల్లో 93,415 మంది, రంగారెడ్డి జిల్లాలో 40,000 మంది, మెదక్ జిల్లాలో 219 పరిశ్రమల్లో 17 వేల మంది, పెద్దపల్లిలో 95 వేల మంది పారిశ్రామిక కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 9 పబ్లిక్ సెకార్లలో (సింగరేణితో సహా) పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు 66 వేల మంది, ఆర్‌టిసి ఉద్యోగులు పదివేల మంది, బ్యాంక్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ సెక్టార్‌లో 19 వేల మంది, పోస్టల్‌లో 26 వేల మంది, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 1,000 మంది, రక్షణ శాఖ ఉద్యోగులు 4,000 మంది, మెడికల్ రిప్స్ 5,200 మంది, మున్సిపల్ కార్మికులు 52,200 మంది, గ్రామ పంచాయితీ కార్మికులు 34,860 మంది పాల్గొన్నట్టు మా దృష్టికి వచ్చింది. మొత్తంగా రాష్ట్రంలో 10,20,000 మంది సమ్మెలో పాల్గొన్నారు. పారిశ్రామిక కార్మికులు పరిశ్రమలను బంద్ పెట్టి సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, సింగరేణి, ఫైనాన్స్ సెక్టార్, బ్యాంక్, ఇన్సూరెన్స్ ఉద్యోగులు, పోస్టల్, సెంట్రల్ గవర్నమెంట్, రక్షణ శాఖ ఉద్యోగులు, మున్సిపల్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకెపి, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఆరోగ్య శాఖ, బీడీ, హమాలీ, భవన నిర్మాణం, ప్రయివేటు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు లక్షలాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొని మోడీ సర్కార్‌పై కన్నెర్రజేశారు. హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులు మహాప్రదర్శనలో కదం తొక్కారు. జిల్లా, మండల, పారిశ్రామిక ప్రాంతాల్లో పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సమ్మెకు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల పోరాట వేదికతో పాటు పలు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాతంత్రవాదులు, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు మద్దతుగా నిలిచాయి.

కార్మిక వర్గ ద్రోహి బిజెపిని తరిమి కొట్టండి

- కార్మికుల శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- నాలుగు లేబర్‌కోడ్లు, నల్లచట్టాలను రద్దు చేయాలి : జాన్‌వెస్లీ, తమ్మినేని
- కాటేదాన్, ఖమ్మం ప్రాంతాల్లో ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో జరిగిన సార్వత్రిక సమ్మె కార్యక్రమంలో జాన్‌వెస్లీ పాల్గొన్నారు. మొదట ఆరాంఘర్, శివరాంపల్లి, దానమ్మ జోపిడి, కాటేదాన్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాదయాత్రగా దుర్గానగర్ నుంచి కాటేదాన్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయానికి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. కార్మికులంతా సమ్మె చేస్తుంటే.. కార్మిక సంఘం అని చెప్పుకునే బీఎంఎస్ సమ్మెలో పాల్గొనకుండా ఇది రాజకీయ సమ్మె అంటూ కార్మికులకు ద్రోహం చేస్తోందని అన్నారు. 8 గంటల పనివిధానాన్ని మార్చి 10 గంటలకు అవసరమైతే 12 గంటలకు పెంచుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని తెలిపారు. దీనికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా జీఓ 282 ద్వారా పనిగంటలు పెంచే కుట్ర చేస్తోందన్నారు. వారానికి 48 గంటలు దాటితే ఓవర్ టైమ్ పేమెంట్ వస్తుందని చెప్పారే తప్ప వారానికి 48 గంటలు మాత్రమే పనిచేయాలని కానీ, వారానికి మూడు రోజులు సెలవులు ఇస్తారని కానీ లేబర్ కోడ్‌లలో ఎక్కడా చెప్పలేదన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేయాలని 6 గంటల తర్వాతే బ్రేక్ ఉంటుందంటూ ప్రభుత్వాలు అధికారికంగానే కార్పొరేట్లకు మద్దతు పలకడం కార్మికుల పట్ల వీరికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఈ కోడ్‌లో 12 శాతంగా ఉన్న పీఎఫ్‌ను 10 శాతానికి తగ్గిస్తామంటున్నారని, అలాగే, సెక్షన్ 16(1) ప్రకారం ఈ 10 శాతం కూడా తగ్గించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. సెక్షన్ 15(1)(ఈ) ప్రకారం ఇపిఎఫ్, ఇపిఎస్, ఇడిఎల్ఐను తనకు అవసరమైన విధంగా మార్చేందుకు, ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్ రేటును నిర్ణయించేందుకు కేంద్ర ప్రభుత్వానికే అధికారం కట్టబెట్టినట్టు చెప్పారు. ఇలాంఇ కోడ్స్‌తో యాజమాన్యాలు దోపిడీ చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నారన్నారు. 300 మంది లోపు కార్మికులు ఉన్న కంపెనీలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కార్మికులను తొలగించడానికి, లే ఆఫ్, మూసివేతలకు యాజమాన్యాలకు లైసెన్స్ ఇచ్చిందన్నారు. మెడికల్ అన్‌ఫిట్ సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండానే చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలతో కార్మికులను తొలగించే అవకాశం యాజమాన్యాలకు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కూడా బీజేపీ విధానాలనే అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి పీసీకే భాస్కర్, ఇండస్ట్రీ నాయకులు ప్రవీణ్, సచిన్, కిషోర్, ట్రాన్స్‌పోర్టు యూనియన్ మండల కార్యదర్శి కాలే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, బిఆర్‌టియు తదితర వామపక్ష పార్టీలు, జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. మోడీ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను, మూడు నూతన సాగు చట్టాలతో రైతాంగాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు పని భద్రత లేకుండా చేయడంతో పాటు శ్రమ దోపిడీని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపై ప్రభుత్వం జులుం చేస్తూ చట్టాలను ప్రయోగించి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందన్నారు. రవాణా రంగానికి సంబంధించి అమల్లోకి వచ్చిన చట్టాలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. సమ్మె సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన మార్పును గమనించైనా నూతన సాగు చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

మోడీ ఖబర్దార్ కార్మికుల సత్తా ఏంటో చూపిస్తాం

- కార్మికులకు నష్టం జరుగుతున్నా సమ్మెలో బిఎంఎస్ ఎందుకు పాల్గొనదు?
- ఎర్రజెండా పుట్టుకే కార్మికవర్గం కోసం
- సార్వత్రిక సమ్మె మహాప్రదర్శనలో కార్మిక, రైతు సంఘాల నేతలు
- ఎస్‌వికె నుంచి ఇందిరా పార్కు వరకు మహాప్రదర్శన



ఎస్‌వికె నుంచి ఇందిరా పార్కు వరకు కార్మికులు చేస్తున్న మహాప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మోడీ ఖబర్దార్..కార్మికుల సత్తా ఏంటో చూపిస్తాం. లేబర్ కోడ్‌లతో కార్మికులకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్నా బిఎంఎస్ సమ్మెలో ఎందుకు పాల్గొనడం లేదు? రాజకీయ లాభం కోసం కార్మికుల ప్రాణాలను పణంగా పెడతారా? కార్మికుల్లారా? ఆలోచించండి. ఏ చిన్న సమస్య వచ్చినా మీపక్షాన నిలబడి కొట్లాడుతున్నదెవరో గుర్తించండి. రాజకీయంగా చైతన్యం కండి. మీ కోసం కొట్లాడేవాళ్లను చట్టసభలకు పంపండి. ఎర్రజెండా పార్టీల పుట్టుకే కార్మిక వర్గం కోసం. మీపక్షాన నికరంగా కొట్లాడేది వారేననే విషయాన్ని గుర్తించడం వరకే పరిమితం కాకండి. రాజకీయ చైతన్యం కండి. ఓటుతో కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న పాలకులు బుద్ధి చెప్పండి' అని కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కు ధర్నా చౌక్ వరకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కార్మికుల మహాప్రదర్శన నిర్వహించారు. అందులో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. మహిళా కార్మికులు కూడా పెద్ద ఎత్తున తరలొచ్చారు. కొందరు కార్మికులు బైకులపై ప్రదర్శనగా వచ్చారు. 'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి..రద్దు చేయాలి..., కార్పొరేట్ల కోసం కార్మికులను బలిచేస్తారా? సిగ్గు..సిగ్గు.., మోడీ సర్కార్ ఖబర్దార్...ఖబర్దార్.., కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు నశించాలి...నశించాలి....' అంటూ దారిపొడుగుతా కార్మికులు నినదించారు. పది గంటల పనివిధానాన్ని ముక్తకంఠంతో ఖండించారు. సమ్మె ప్రదర్శనకు ఇందిరా పార్కు వద్ద సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మద్దతు తెలిపారు. మహా ప్రదర్శన ముందు భాగంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, బిఆర్‌టియు అధ్యక్షులు రాంబాబు యాదవ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టియుసిఐ కార్యదర్శి ఎస్‌ఎల్ పద్మ, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ బోస్, బిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారన్న, ఎఐయుటియుసి రాష్ట్ర ఇన్‌చార్జి భరత్, ఎస్‌కెఎం తెలంగాణ కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, బి పద్మ, ఐఎఫ్‌టియు నేత అనురాధ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, నాయకులు కుమార్ తదితరులు ఉన్నారు. టిడబ్ల్యుజెఎఫ్, హెచ్‌యుజె నాయకులు సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీగా వచ్చారు. ప్రదర్శనలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రజనీకాంత్, టి.నాగరాజు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆనగంటి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శననుద్దేశించి కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. పార్లమెంట్‌లో మందబల ముందని మోడీ సర్కారు ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదనీ, ప్రజా, కార్మిక క్షేత్రంలో వారికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రెండు కార్మిక కోడ్‌లను తామూ వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న బిఎంఎస్ సమ్మెలో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. కార్మిక సంఘాలు ఐక్యత కోసం పనిచేయాలిగానీ...విడగొట్టడం కోసం కాదని చెప్పారు. కార్మికులకు నష్టం జరుగుతున్నా పట్టని కార్మిక సంఘం ఎందుకు అని నిలదీశారు. పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తుంటే ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానాన్ని తెరపైకి తేవడం దుర్మార్గమని పేర్కొన్నారు. దేశంలోని రైతులకు నష్టం చేకూర్చేలా ఇతర దేశాల నుంచి ఇష్టాను సారంగా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం దారుణమని విమర్శించారు. ఇక్కడి రైతులు ఏం కావాలని ప్రశ్నించారు. ఇదంతా వ్యవస్థాయాన్ని కార్పొరేటీకరణ చేసే కుట్రలో భాగమేనని చెప్పారు. అమెరికాలో ఎన్నికల్లో ట్రంప్‌నకు మద్దతిచ్చిన పెట్టుబడిదారులు ఎలన్‌మస్క్ ఇప్పుడు ఆయన్ను వ్యతిరేకిస్తూ పార్టీ పెట్టారని గుర్తుచేశారు. మనదేశంలో మోడీ సర్కారుకు ఆర్థిక మద్దతిస్తున్న అంబానీ, అదానిలకు కూడా రానున్న కాలంలో మోకే అధికారం కావాలని డిమాండ్ కూడా చేస్తారని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు రాయితీలిచ్చి పేదలపై భారాలు మోపడాన్ని తప్పుబట్టారు.

కేర్‌లో అత్యాధునిక ఎఐ ఆధారిత రోబోటిక్ సర్జరీ సిస్టమ్

- హైటెక్ సిటీ బ్రాంచ్‌లో ఏర్పాటు



ప్రజాశక్తి - హైదరాబాద్

కేర్ హాస్పిటల్స్ తన హైటెక్ సిటీ శాఖలో అత్యాధునిక ఎఐ ఆధారిత స్ట్రైకర్ మాకో రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌లిను ప్రారంభించింది. ఇది తెలంగాణలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలకు ఒక కొత్త దశ అని ఆ సంస్థ పేర్కొంది. మాకొ రోబో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో మరింత ఖచ్చితత్వం, ప్రతి రోగికి తగిన విధంగా చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల శస్త్రచికిత్స ఫలితాలు మెరుగవుతాయని ఆ సంస్థ తెలిపింది. ఈ నూతన సేవలను ఎంఎల్‌ఎ అరెకపూడి గాంధీ, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాలిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్, గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ అశోక్ రాజు గొట్టెముక్కల, డాక్టర్ వాసుదేవ జువ్వాడి, డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ శరత్ బాబు, ఇతర సీనియర్ డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొలంబోలో ఫాల్కన్ పంప్స్ డీలర్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటు



ప్రజాశక్తి - హైదరాబాద్ :

ప్రముఖ పంపులు, విద్యుత్ ఉపకరాలన కంపెనీ ఫాల్కన్ పంప్స్ ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్‌ల ఆధ్వర్యంలో కొటంబోలో ఇంటర్నేషనల్ డీలర్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ కాన్ఫరెన్స్‌లో ఫాల్కన్ గ్రూప్స్ వారి నూతన ఉత్పాదనలు, టెక్నికల్ నవీకరణల గూర్చి వివరించడం జరిగిందని ఆ సంస్థ పేర్కొంది. ఈ కాన్ఫరెన్స్ నందు బిజినెస్ లక్ష్యాన్ని చేరిన ప్రతీ డీలర్‌ను అవార్డుతో ఘనంగా సత్కరించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఫాల్కన్ పంప్స్ ఛైర్మన్ భార్గవ్ సువాగియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమల్ నయన్ సోజిత్ర, ఫాల్కన్ కేబుల్స్ డైరెక్టర్ పారస్ శింగాల, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ నల్లపాటి బసంత్ గుప్తా, నల్లపాటి కళ్యాణ్ గుప్తా, రెండు రాష్ట్రాల డీలర్స్, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

- తాడ్వాయిలో పోలీసుల బందోబస్తు మధ్య ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార కేంద్రం వద్ద రైతులు తమకు యూరియా దొరుకుతుందో లేదోనని యూరియా కోసం బుధవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. పోలీసుల మధ్య బందోబస్తుతో ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు. చిన్నపాటి తగాదాలు రావొద్దనే ఉద్దేశంతో స్థానిక పోలీసులు పహారా చేపట్టారు. మండలంలో ఇప్పటివరకు 1258 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని.. గతేడాది ఈ సమయానికి 1150 మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా.. ఈ ఏడు ఇదే సమయానికి 88 మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా సరఫరా చేసినట్టు మండల వ్యవసాయాధికారి నరసింహులు తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా ఉందని ఖరీఫ్‌కు కావాల్సిన మేరకే కొనుగోలు చేయాలని.. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులకు గురికావొద్దని ఆయన రైతులకు సూచించారు.

విద్యారంగ సమస్యలపై చర్చించాలి

- సిఎం రేవంత్ రెడ్డికి ఆప్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు సమయమివ్వాలని తమ పార్టీ ప్రతినిధులకు సిఎం రేవంత్ రెడ్డిని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోరింది. ఈ మేరకు బుధవారం ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. సమయమివ్వకపోతే సచివాలయంలో బైఠాయిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్య కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారనీ, విద్యారంగంలో సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రయివేటు పాఠశాలల ఫీజుల దోపిడీ అంతులేకుండా జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆవాజ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- రియాజ్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీల హక్కుల సాధనకు, లౌకికవాదం కోసం కృషి చేస్తున్న ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎండి రియాజ్ పిలుపునిచ్చారు. ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్‌తో కలిసి హైదరాబాద్‌లోని లైబ్రరీల సంస్థ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకికవాదం, మతసామరస్యం కోసం పాటుపడుతున్న అవాజ్ మహాసభలకు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాజ్ హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్, అబ్దుల్ లతీఫ్, నసీరుద్దీన్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

వలసపాలనను మించిన ఆర్థిక అసమానతలు

- పోరాటాన్ని తీవ్రతరం చేయాలి
- పాలకులను ప్రశ్నించాలి : ఎస్ వీరయ్య
- జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్షియల్ సెక్టార్స్ యూనియన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఇండిపెండెంట్ ఫెడరేషన్లు దేశవ్యాప్తంగా చేపట్టిన ఒక రోజు సమ్మెను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) అధ్యక్షులు డి గిరిధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వలసపాలనను మించిన ఆర్థిక అసమానతలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెకు కొద్ది రోజుల ముందే తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు పని గంటలను పెంచుతూ ఉత్తర్వులిచ్చాయని చెప్పారు. దేశంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా సులభతర వాణిజ్యం కోసం కార్మికశక్తిని చౌకగా ఉపయోగించుకోవడంతో పాటు కార్మికోద్యమాన్ని బలహీనం చేసేందుకు 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చాలని నిర్ణయించినట్టు వివరించారు. కార్మికులు పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నారనీ, ఆ సమస్యను ఎదుర్కొనేందుకు అంతే స్థాయిలో పోరాటం తీవ్రంగా ఉండాలని సూచించారు. సింగరేణితో పాటు అనేక సంస్థల్లో సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికీ కనీస వేతనాలు అత్యధిక మంది కార్మికులకు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఐఎల్‌ఓ రోజుకు పని గంటలను 6 గంటలకు పరిమితం చేయాలని సూచిస్తే, కార్పొరేట్లు వారానికి 70 నుంచి 90 గంటలు పని చేయాలంటున్నారని తెలిపారు. ప్రపంచంలోనే 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ మన దేశమని పాలకులు చెబుతున్నారనీ, ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం రోజు రోజుకు దిగజారిపోతున్నాయని విమర్శించారు. సంపదను సృష్టిస్తున్న కార్మికుల వేతనాలు మాత్రం హీనంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్త చేశారు. ప్రజలు, కార్మికులు జాతీయోద్యమ స్ఫూర్తితో పాలకులను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాజకీయ మద్దతు లేకున్నా సరే చారిత్రాత్మక పోరాటాన్ని చేసిన బొంబాయి వర్కర్స్ యూనియన్‌ను స్ఫూర్తిగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోస్ మాట్లాడుతూ రైతుల ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్మికులు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు, కార్మికుల పాత్ర లేకుండా కేవలం విదేశీ పెట్టుబడులతో దేశం అభివృద్ధి చెందదని తెలిపారు.

ప్రయివేటీకరణను అడ్డుకుంటాం : శ్రీకాంత్ మిశ్రా

ఎల్‌ఐసి ప్రయివేటీకరణను అడ్డుకుంటూనే ఉంటామని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా తెలిపారు. రూ. ఐదు కోట్ల మూలధనంతో ప్రారంభమై ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో రూ.55 లక్షల కోట్ల సంపద సమకూర్చుకున్న ఎల్‌ఐసిని ప్రయివేటుకు అప్పజెప్పేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎల్‌ఐసికి ఉన్న సావరీన్ గ్యారంటీని తొలగించాలని యుఎస్ ఒత్తిడి చేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికే 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశమున్నప్పటికీ 36 శాతమే నిధులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో దాన్ని 100 శాతానికి పెంచాలనుకోవడం తిరోగమన చర్యగా అభివర్ణించారు. రాబోయే వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు ప్రవేశపెడుతున్నారనీ, ఎల్‌ఐసీ స్వతంత్ర ప్రతిపత్తిని తగ్గించే చర్యలను వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. బ్యాంకుల విలీనానికి అంగీకరించిన ప్రభుత్వం ప్రభుత్వ సాధారణ బీమా సంస్థల విలీనానికి ఎందుకు ఒప్పుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే క్లాస్ 3, క్లాస్ 4 నియామకాలను చేపట్టాలనీ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి వర్తింపజేయాలని మిశ్రా డిమాండ్ చేశారు. ఎఐబిఇఎ నాయకులు బిఎస్ రాంబాబు మాట్లాడుతూ కార్పొరేట్లకు తలొగ్గిన కేంద్రం కార్మిక చట్టాలను మార్చి లేబర్ కోడ్‌లను తెస్తున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని సూచించారు. బ్యాంకుల ప్రయివేటీకరణకు పూనుకుంటే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో అధిక సంఖ్యలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలనీ, ఏళ్ల తరబడి తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా పలువురు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎల్‌ఐసీ దక్షిణ మధ్య జోనల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి టివిఎన్‌ఎస్ రవీంద్రనాథ్, బ్యాంక్ ఆఫీసర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్, బెఫీ నాయకులు నాయకులు గంగాధర్, సతీష్ తదితరులు మాట్లాడారు. హరీశ్ బాబు, సతీష్ (ఆర్‌బీఐ), ఎం శివశంకర్ (జిఐసి), కె వేణుగోపాల్, జయరాజు (ఎల్‌ఐసి పెన్షనర్స్ అసోసియేషన్) సంఘీభావం తెలిపారు. ఐసిఇయు ప్రధాన కార్యదర్శి ఎల్ మద్దిలేటి, జోనల్ నాయకులు పి సుజాత, తిరుపతయ్య, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- శంషాబాద్‌లో చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు
- మహిళ అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారి కిడ్నాప్ కేసును కొద్ది గంటల్లోనే పోలీసులు ఛేదించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన క్యాత్రమోని లక్ష్మమ్మ ఈ నెల ఒకటో తేదీన తన ఇద్దరు కూతుర్లతో కలిసి శంషాబాద్‌లోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగడానికి వచ్చింది. అక్కడికి శంషాబాద్‌లోని రాళ్లగూడ ఇందిరానగర్ దొడ్డికి చెందిన రంగాపురం రజినీ (37) కల్లు తాగడానికి వచ్చి.. వీరితో మాటలు కలిపింది. అనంతరం లక్ష్మమ్మ కూతురు కీర్తన(6)ను రజినీ కిడ్నాప్ చేసింది. దాంతో చిన్నారి తల్లి ఈ నెల 8వ తేదీన తన కూతురు కిడ్నాప్‌కు గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెంటనే అప్రమత్తమై.. సీసీకెమెరాలు పరిశీలించారు. టెక్నికల్ ఆధారాలతో కిడ్నాప్ కేసును ఛేదించారు. చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళను మంగళవారం రాత్రి వికారాబాద్‌లో గుర్తించి, అక్కడే పట్టుకున్నారు. ఆమె వద్ద అపహరణకు గురైన కీర్తన క్షేమంగా ఉంది. పోలీసులు పాపతోపాటు ఆమెను శంషాబాద్‌కు తరలించారు. పాపను బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇనాక్ సాహిత్యం వివిధ భాషల్లో అనువాదం కావాలి

- తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానంద రావు



ప్రజాశక్తి కల్చరల్

కొలకలూరి ఇనాక్ సాహిత్యం వివిధ భాషల్లో అనువాదం కావాలని , ఇందువల్ల తెలుగు భాష ఔన్నత్యం ఇతర భాషల వారికి తెలుస్తుంది అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వి నిత్యానంద రావు అన్నారు . శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణ లో జరుగుతున్న ఇనాక్ సాహితీ సప్తహం ముగింపు సభ కళా సుబ్బారావు కళా వేదిక పై బుధవారం జరిగింది ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పాటిబంట్ల సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు. ప్రముఖ అనువాదకుడు ఆచార్య జి ఎస్ ఆర్ కృష్ణ మూర్తి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ నాటకం తిరుప్పాల్ ఆళ్వార్ జీవిత చరిత్ర సంస్కృత భాష అనువాద గ్రంథంను జస్టిస్ ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు . వారం రోజులు పాటు తెలుగు సాహితీ వేత్త ఇనాక్ సాహిత్యాన్ని విశదీకరణ కోసం సమావేశాలు నిర్వహించటం అరుదు అని చెప్పారు . ప్రముఖ విమర్శకుడు దారా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ దళితులను నిషేధించిన సంస్కృత భాషలో కి ఇనాక్ నాటకం అనువాదం కావటం విశేష మన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కవి డాక్టర్ ప్రభాకర్ నాట్య గురువు జ్వాలా ముఖి పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నిందితుల విడుదలపై బిఆర్‌ఎస్ నేతల ఆగ్రహం

- భువనగిరి పట్టణంలో రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆస్పత్రి నడుపుతూ లింగనిర్ధారణ, గర్భస్రావం చేసిన నిందితులను వెంటనే విడుదల చేయడంపై బిఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డినే సహకారం అందించారని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి.కిరణ్‌కుమార్ ఆరోపించారు. బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రయివేట్ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ, అబార్షన్లు చేస్తున్నారని, కలెక్టర్, డిఎంహెచ్‌ఒ పరిశీలించి ఆ ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపిలు అతికం లక్ష్మీనారాయణగౌడ్, సూరపల్లి రమేష్, మాజీ జడ్‌పిటిసి సందెల సుధాకర్, నాయకులు ఇట్టబోయిన గోపాల్, కుశంగలరాజు, బర్రె రమేష్, తాడూరు భిక్షపతి, దొడ్డికాడి భగత్, కంచి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల బలోపేతానికి చర్యలు

- ముత్తినేని వీరయ్యతో దివ్య దేవరాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని సెర్ప్ కార్యాలయంలో వికలాంగుల శాఖ స్టేట్ కో ఆపరేటివ్ కోఆపరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్య దేవరాజన్‌తో సమావేశమయ్యారు. వికలాంగుల సంక్షేమాభివృద్ధికి తీసుకుంట్నున్న చర్యలను ఈ సందర్భంగా దివ్య దేవరాజన్‌తో పాటు డైరెక్టర్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల గ్రామాల్లో 18 వేల వికలాంగుల స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. ఆ గ్రూపులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సెర్ప్ డైరెక్టర్ లు సాయి కిషోర్, కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమ్మెలో ఎల్‌ఐసి ఉద్యోగులు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సికింద్రాబాద్ ఎల్‌ఐసి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ లోని అతిపెద్ద క్లాస్-3వ, 4వ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. గాంధీనగర్ లోని ఎల్‌ఐసి డివిజనల్ ఆఫీస్ ప్రాంగణంలో దాదాపు వందలాది మంది ఉద్యోగులు పట్టణ ప్రాంతంలోని వివిధ ఎల్‌ఐసి కార్యాలయాల నుంచి తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ సిజడ్ఐఇఎఫ్ అధ్యక్షులు పి సతీష్, సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య, సహ కోశాధికారి రాజేష్ సింగ్ హాజరయ్యారు. ఈ సమ్మె ఉద్దేశించి పి సతీష్ మాట్లాడుతూ ఎల్‌ఐసిలో ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఉపసంహరించాలని, జీవిత బీమా, హెల్త్ భీమా రంగంలో పాలసీలపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ గుణశేఖర్, డిఎస్ రఘు, కార్యవర్గ సభ్యులు బి ప్రభాకర్, హెచ్‌ఎస్ చంద్రశేఖర్, వివేక్ కౌశిక్, జావేద్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



పింక్స్ అండ్ బ్లూస్ 'పోనీ సలూన్స్ కన్వర్షన్'

హైదరాబాద్: దేశీయ బ్యూటీ, వెల్‌నెస్ రంగంలోని పింక్స్ అండ్ బ్లూస్ విప్లవాత్మక "పోనీ సలూన్స్ కన్వర్షన్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. జన శక్తి నయీ బ్రాహ్మణ సంఘం సహకారంతో పింక్స్ అండ్ బ్లూస్ బుధవారం హైదరాబాద్‌లోని రాంకోటిలోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. చిన్నస్థాయి, బ్రాండ్ లేని సలూన్లను శక్తివంతంగా తయారుచేయడం, నాయీ బ్రాహ్మణుల వారసత్వాన్ని కాపాడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు వికాస్ పేర్కొన్నారు. సలూన్ కమ్యూనిటీను సహకరించడం, బలోపేతం చేయడం తమ లక్ష్యమన్నారు.



ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధ్యం

- వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను కొనసాగించాలి : సోమయ్య, బసవ పున్నయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య పిలుపునిచ్చారు. 44 కార్మిక చట్టాలతో పాటు రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల రద్దుకి నిరసనగా కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన సమ్మె కు సంఘీభావం గా బుధవారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్‌యుజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి మామిడి సోమయ్య మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా వర్కింగ్ జర్నలిస్టు చట్టం అమలులో ఉందనీ, దాన్ని రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలని కోరారు. బసవ పున్నయ్య మాట్లాడుతూ మీడియాలో కార్పొరేట్లు ఎంటర్ అయిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, జర్నలిస్టుల హక్కులు హరించి వేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులకు కనీస వేతనాలు కూడా అమలు కావటం లేదన్నారు. ప్రజాసమస్యలపై అధ్యయనం, హక్కుల సాధన దిశగా జర్నలిస్టులు ముందుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్ యు జే అధ్యక్షులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టు చట్టం రద్దు ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జర్నలిస్టు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ ఉపాధ్యక్షులు పి ఆనందం, బి రాజశేఖర్, కార్యదర్శులు ఇ.చంద్ర శేఖర్, సలీమా, గండ్ర నవీన్, హెచ్ యు జే కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నాగవాణి, మధుకర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.